సాక్షి తిరుపతి

సోమవారం ॥ 7 ॥ ఏప్రిల్ ॥ 2025



అరాచకమే అ'జెండా'

పాకాలలోని కూరగాయల మార్కెట్ వద్ద వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మెను కూటమి నేతలు ధ్వంసం చేశారు. - 8లో



కలుషితం.. భూగర్భ జలం


తిరుపతి శివారులోని ఓ పాల డెయిరీ నుంచి వెలువడుతున్న వ్యర్థాల కారణంగా భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. - 8లో



కమనీయం.. కల్యాణం

తుమ్మలగుంటలోని శ్రీకల్యాణ వెంకన్న ఆలయంలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించారు. - 8లో

స్నపన తిరుమంజనం



తిరుపతిలోని శ్రీకోదండరామస్వామివారి ఆలయంలో ఆదివారం ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామలక్ష్మణుల ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం జరిపించారు. - తిరుపతి కల్చరల్

సుగంధ శోభితం



తిరుమలలో ఆదివారం శ్రీరామ నవమిని పురస్కరించుకుని శాస్త్రోక్తంగా ఆస్థానం నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాములు, లక్ష్మణ, హనుమ ఉత్సవర్లను విశేషంగా సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. - తిరుమల

సుముహూర్త వైభవం



శ్రీకాళహస్తి పట్టణం నెప్రాలావీధిలోని పట్టాభి రామమందిరంలో ఆదివారం నవమి వేడుకలు నిర్వహించారు. సీతారాములకు కనులపండువగా కల్యాణ మహోత్సవం జరిపించారు. విశేష పూజలు చేశారు. - శ్రీకాళహస్తి

న్యూస్‌రీల్

శ్రీసిటీలో 'సమ్మర్ క్యాంప్'

శ్రీసిటీ (సత్యవేడు): శ్రీసిటీలో ఈ నెల 9 నుంచి మే 30వ తేదీ వరకు విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ నిర్వహించనున్నారు. శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పిల్లలకు కంప్యూటర్ కోర్సు, ఇంగ్లిషు గ్రామర్, రైటింగ్ స్కిల్, గణిత సూత్రాలు, పోటీ పరీక్షల మెలకువలు, జనరల్ నాలెడ్జ్, ప్రపంచ వార్తలు తదిర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే యోగా, కరాటే, స్పోర్ట్స్, గేమ్స్ విభాగాల్లో ట్రైనింగ్ అందించనున్నారు. ఈ క్రమంలోనే క్విజ్ పోటీలు, ఇంటరాక్టివ్ సెషన్‌లు నిర్వహించనున్నారు. ప్రాథమిక చికిత్సలపై అవగాహన కల్పించనున్నారు. శ్రీసిటీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో జరిగే క్యాంపునకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత భోజనం సౌకర్యం ఉంటుంది. అలాగే శ్రీసిటీ జీరో పాయింట్, చెరివి కూడలి వరకు ఉచిత వాహనం సదుపాయం కల్పించనున్నారు. ఆసక్తిగల విద్యార్థులు 833 103 5857 నంబర్‌లో సంప్రదించాలని శ్రీసిటీ అధికారులు సూచించారు.

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి వీడ్కోలు



సీజేఐకి జ్ఞాపిక అందిస్తున్న కలెక్టర్, ఎస్పీ

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): జిల్లాలో రెండు రోజుల పర్యటన ముగించుకుని ఆదివారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా తిరుగుప్రయాణమయ్యారు. పలువురు న్యాయమూర్తులు, అధికారులు సాదర వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయనకు జ్ఞాపిక అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హైకోర్టు విజిలెన్స్ రిజిస్ట్రార్ శ్రీనివాస శివరామ్, డిస్ట్రిక్ట్ ప్రిన్సిపల్ జడ్జి ఈ. భీమారావు, తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి గురునాథ్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, జేసీ శుభం బన్సల్, జ్యుడీషియల్ ప్రోటోకాల్ సూపరింటెండెంట్ ధనుంజయ నాయుడు పాల్గొన్నారు.

ప్రధాని ప్రిన్సిపల్ సెక్రటరీకి సాదరంగా..



శక్తికాంత్‌దాస్‌కు జ్ఞాపిక అందిస్తున్న కలెక్టర్, జేసీ

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : జిల్లాలో రెండు రోజుల పర్యటన ముగించుకుని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రిన్సిపల్ సెక్రటరీ శక్తికాంత్ దాస్ ఆదివారం రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభమ్ బన్సల్ సాదరంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జ్ఞాపిక అందించి ఘనంగా సత్కరించారు.

11న కలెక్టరేట్ ఎదుట బీసీల నిరసన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

తిరుపతి సిటీ : బీసీలకు 52శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ ఈ నెల 11వ తేదీన కలెక్టరేట్ వద్ద నిరసనకు దిగనున్నట్లు బీఎస్పీ, బీసీ సమన్వయ కమిటీ నేతలు వెల్లడించారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. దేశంలో బీసీలు అధికంగా ఉన్నప్పటికీ రాజకీయంగా, ఆర్థికంగా ప్రాధాన్యత లేకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ సంపద కేవలం 10శాతం మంది చేతుల్లోనే ఉందని, బీసీలను అగ్రకులాలవారు అణగదొక్కేశారని మండిపడ్డారు. దేశంలో కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీలను అధికారం కోసం వాడుకుని వదిలేస్తున్నారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే కూటమి ప్రభుత్వ ఎన్నికల సమయంలో వడ్డెర్లకు ఇచ్చిన హామీని అమలు చేయాలని స్పష్టం చేశారు. కలెక్టరేట్ వద్ద చేపట్టే నిరసనకు జిల్లాలోని అన్ని కుల సంఘాల నేతలు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం నిరసనకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు జయచంద్ర, నేతలు వేణుగోపాల్ రాజు, శశికుమార్, ధనంజయ, వెంకన్న, బీసీ సమన్వయ కమిటీ చైర్మన్ బీవీ కేశవులు, నేతలు వి.రమణ, రోశయ్య, విజయభాస్కర్ పాల్గొన్నారు.

ఉచితం మాటున.. ఇసుక మేత!



రేణిగుంట మండలం జీపాళెం వద్ద యంత్రాలతో సాగుతున్న ఇసుక తవ్వకం

ఉచిత ఇసుకను కూటమి నేతలు ప్రకటనలకే పరిమితం చేసేశారు. ప్రభుత్వ ఆదేశాలను అనుకూలంగా మార్చుకుని విచ్చలవిడిగా తవ్వకాలు సాగిస్తున్నారు. నదులు.. వాగులు.. వంకల్లో విధ్వంసం సృష్టిస్తున్నారు. నిత్యం వందల వాహనాల్లో అక్రమంగా ఇసుకను తరలించేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో స్థానిక ఎమ్మెల్యేల పేరు చెప్పుకుని అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఈ క్రమంలోనే అధికారులు సైతం పచ్చమూకకు పూర్తిగా సహకరిస్తున్నారు. పర్యావరణానికి ముప్పు వాటిల్లుతున్నప్పటికీ చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఇల్లు కట్టుకునేందుకు ఇసుక కోసం వచ్చిన సామాన్యులపై జులుం ప్రదర్శిస్తున్నారు. నిబంధనలను తుంగలో తొక్కిన కూటమి నేతలకు మాత్రం కొమ్ముకాస్తున్నారు.

జిల్లాలో ఇష్టారాజ్యంగా సైఖితం

- యంత్రాలతో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు
- టిప్పర్లతో సరిహద్దు దాటిస్తున్న కూటమి నేతలు
- ఇంటి నిర్మాణాల నిమిత్తం సామాన్యులు వెళితే కేసులు
- పచ్చమూక అక్రమార్జనకు అండగా అధికారులు



రెడ్డివారిపల్లె వద్ద స్వర్ణముఖి నదిలో జేసీబీతో ఇసుకను తోడేస్తున్న దృశ్యం (ఫైల్)

సాక్షి ప్రతినిధి, తిరుపతి : జిల్లాలో కూటమి నేతలకు ఉచిత ఇసుక ప్రకటన పెద్ద వరంగా మారింది. స్థానికుల పేరుచెప్పి విచ్చలవిడిగా ఇసుక తవ్వి అక్రమంగా తరలించి సొమ్ముచేసుకుంటున్నారు. కళ్లముందే మొత్తం వ్యవహారం నడుస్తున్నా అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. మామూళ్ల మత్తులో జోగుతున్నారు. ప్రధానంగా జిల్లాలోని శ్రీకాళహస్తి, చంద్రగిరి, సత్యవేడు, సూళ్లూరుపేట, గూడూరు నియోజక వర్గాల పరిధిలో ఇసుక అక్రమ తవ్వకాలు, తరలింపునకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. స్థానిక ఎమ్మెల్యేల పేరుచెప్పి అనుచరులు యథేచ్ఛగా ఇసుక తోడేస్తున్నారు. నదుల్లో ఇసుక తవ్వకాలు చేయడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నా ఇసుకాసురులు లెక్కచేయడం లేదు.

అక్కడ ఇష్టారాజ్యం

- సత్యవేడు, సూళ్లూరుపేట, గూడూరు నియోజక వర్గాల పరిధిలో టీడీపీ నేతలు ఇష్టారాజ్యంగా ఇసుక వ్యాపారం సాగిస్తున్నారు.
- సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం, పిచ్చాటూరు పరిధిలో అడవికొడియంబేడు, బైటకొడియంబేడు పరిధిలోని అరుణానదిలోని ఇసుకను భారీ యంత్రాలతో తవ్వి తమిళనాడుకు తరలించేస్తున్నారు.
- సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేట మండలం అన్నమేడు, మర్లపల్లె, భీమవరంలో స్వర్ణముఖి నది నుంచి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, తండ్రి పేరుచెప్పుకుని వారి బంధువులు, అనుచరులు యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు.
- పెళ్లకూరు మండలం కలవకూరు, చావాలి గ్రామాల నుంచి పలువురు కూటమి నేతలు గుట్టుచప్పుడు కాకుండా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు.
- గూడూరు నియోజక వర్గం చిట్టమూరు మండలం రొయ్యల వాగు, గుణపాటిపాళెం వద్ద ప్రతి రోజూ ఇసుకను తోడి అక్రమంగా తరలించి సొమ్ముచేసుకుంటున్నారు.
- వెంకటగిరి నియోజకవర్గం కలువాయి మండలంలోని తెలుగురాయపురం, రాజుపాళెం నుంచి రాత్రి పగలు తేడా లేకుండా భారీ యంత్రాలతో ఇసుకను తోడేస్తున్నారు. బెంగళూరు, చెన్నైకి తరలించి సొమ్ముచేసుకుంటున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా వాగులు, వంకలు, ప్రైవేటు భూముల్లో సైతం కూటమి నేతలు అక్రమంగా ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం గమనార్హం.

స్వర్ణమ్మకు గర్భశోకం!

- శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని స్వర్ణముఖి నది పరీవాహకప్రాంతంలో ఇసుకను కూటమి నేతలు ఇష్టారాజ్యంగా తోడేస్తున్నారు.
- తొట్టంబేడు మండలం పెన్నలపాడు, విరూపాక్షిపురం వద్ద స్వర్ణముఖి నదిలో ఇసుకను యథేచ్ఛగా తవ్వేస్తున్నారు.
- శ్రీకాళహస్తి పట్టణంలోని ఎంజీఎం హోటల్ వెనుక, ఎన్టీఆర్ పార్కు లోపలి వైపు, ఆనకట్ట సమీపంలో పచ్చమూకకు అడ్డే లేకుండా పోయింది.
- శ్రీకాళహస్తి మండలం టీఎంవీ కండ్రిగ, చుక్కలనిడిగల్లు, పుల్లారెడ్డి కండ్రిగ ప్రాంతాల్లో ఇసుకను అక్రమంగా తవ్వేసి, తరలించి సొమ్ముచేసుకుంటున్నారు.
- ఏర్పేడు మండలం మునలిపేడు, పాపానాయుడుపేట పరిధిలోని స్వర్ణముఖి నదిలోని ఇసుకను అక్రమంగా దోచుకుంటున్నారు.
- రేణిగుంట మండలం గాజులమండ్యం, జీపాళ్యెం ప్రాంతాల్లో స్వర్ణముఖి పరివాహక ప్రాంతాల వద్ద ఎక్కడ పడితే అక్కడ ఇసుకను తోడేస్తున్నారు. ఇందులో ఎమ్మెల్యే ముఖ్యఅనుచరుల పాత్ర ఉందని ప్రచారం జరుగుతోంది. జీపాళెం వద్ద స్వర్ణముఖి నదిలో చెన్నంపల్లెకు చెందిన టీడీపీ కార్యకర్త ఒకరు ఎమ్మెల్యే పేరుచెప్పి అక్రమంగా తవ్వకాలు సాగిస్తున్నారు. ప్రతి రోజూ వంద ట్రాక్టర్ల ఇసుకను తోడి తరలించి సొమ్ముచేసుకుంటున్నారు. ఇదేంటని ప్రశ్నించిన వారిపై దౌర్జన్యానికి దిగుతున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చంద్రగిరిలో తగ్గేదేలే..!

- చంద్రగిరి, తిరుపతి రూరల్ మండలాల పరిధిలో ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు.
- చంద్రగిరి మండలంలోని ఎం.కొత్తపల్లె, ఐతేపల్లె, నాగయ్యగారిపల్లె, రెడ్డివారిపల్లె, నరసింగాపురం, ఋచ్చినాయుడుపల్లె, తొండవాడ, శానంబట్లలో స్వర్ణముఖి నది నుంచి ఇసుకను జేసీబీలతో తవ్వుతూ టిప్పర్లతో బయటి ప్రాంతాలకు తరలించేస్తున్నారు.
- తిరుపతి రూరల్ మండలంలోని పైడిపల్లె, అడపారెడ్డిపల్లె, దుర్గసముద్రం, చిగురువాడ, కేసీపేట, తనపల్లె, తిరుచానూరు ప్రాంతాల్లో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. నదిలో ఇసుక నిల్వలు కరిగిపోతుండడంతో సమీపంలోని రైతుల పొలాల్లో కూడా తవ్వేస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రతి రోజూ వందల కొద్దీ ట్రాక్టర్లు, టిప్పర్లు వేగంగా రాకపోకలు సాగిస్తుండడంతో స్థానికులు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు సైతం భయపడుతున్నారు.

చంద్రగిరిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న దృశ్యం(ఫైల్)



రేణిగుంట మండలంలో..



సీపీఎస్ రద్దుకు చైతన్య యాత్ర



మాట్లాడుతున్న చీర్ల కిరణ్

తిరుపతి సిటీ : రాష్ట్రంలో సీపీఎస్ రద్దు కోసం చైతన్య యాత్ర చేపట్టనున్నట్లు ఏపీ సీపీఎస్‌ఈఏ అసోసియేట్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ వెల్లడించారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. మే 1న ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు యాత్ర నిర్వహిస్తూ ఆయా జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు. తొలి రోజు తిరుపతిలో కలెక్టర్‌కు అర్జీ అందించనున్నట్లు వివరించారు. చైతన్య యాత్రలో భాగంగా అన్ని విభాగాలకు చెందిన ప్రభుత్వోద్యోగులను కలుస్తూ సీపీఎస్‌తో వాటిల్లే నష్టాలను తెలియజేయనున్నట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు సెప్టెంబర్ ఒకటో తేదీలోపు సీపీఎస్‌పై తగు నిర్ణయం తీసుకుని పాత పెన్షన్ విధానం అమలు చేయాలని లేకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం చైతన్య యాత్ర పోస్టర్ విడుదల చేశారు. సమావేశంలో నేతలు వంకీపురం పవన్, గుంటూరు రేఖ, మురళి, ధరణి కుమార్, ఈశ్వర్ నాయక్, చలపతి, గోపాల్ పాల్గొన్నారు.

కార్మికుల నమోదుకు ప్రత్యేక శిబిరాలు

చిత్తూరు కార్పొరేషన్ : ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన (ఏబీపీఎంజేఏవై) విస్తరణను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని చిత్తూరు, తిరుపతి జిల్లాల ఉప కార్మిక కమిషనర్ ఓంకార్‌రావు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఇందుకు గాను సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకుంటే గుర్తింపు కార్డు ఇవ్వనున్నట్లు చెప్పారు. పోర్టల్ నందు ప్లాట్, గిగ్ కార్మికులు పేర్లు నమోదుకు ఈనెల 7వ తేదీ నుంచి 17వ తేదీ వరకూ ప్రత్యేక నమోదు శిబిరాలను తిరుపతి, చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేశామన్నారు. భవిష్యత్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రయోజనాలను పొందాలంటే నమోదు తప్పనిసరన్నారు. తదితర వివరాలకు కార్మిక శాఖ కార్యాలయంలో లేదా మెప్మా, డీఆర్‌డీఏ అధికారులు, తిరుపతి జిల్లా 9492555230, చిత్తూరు జిల్లా 9492555223, 9492555216 నంబర్లను సంప్రదించాలని వివరించారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 29 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 78,496 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 30,046 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.60 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేనివారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 3 గంటల్లోనే దర్శనమవుతోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశిత సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వస్తే క్యూలోకి అనుమతించమని స్పష్టం చేసింది.

వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యం



సమావేశంలో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి(సైదాపురం): ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ వెంకటగిరి మున్సిపాలిటీలో టీడీపీ నేతలు దుర్మార్గంగా ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోతుందని, వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యమని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం ఎన్‌జేఆర్ భవన్‌లో ఆయన కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. నేదురుమల్లి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ జెండాతో 25 మంది కౌన్సిలర్లు విజయం సాధించారన్నారు. ఈ క్రమంలో కూటమి నేతలు కొందరిని ప్రలోభాలకుగ గురి చేసి అక్రమంగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారని మండిపడ్డారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లకు విప్ జారీ చేశామని, ధిక్కరించిన వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు. 19 మంది కౌన్సిలర్లు తమ వెంటే ఉన్నారని, మిగిలిన ఆరుగురు సైతం వైఎస్సార్‌సీపీకే ఓటేసే అవకాశం ఉందని వెల్లడించారు. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులను దించాలని చూస్తే సహించే ప్రసక్తే లేదని వివరించారు. కూటమి నేతలు కుట్రలకు తెరతీయకుండా అభివృద్ధిపై దృష్టి సారించాలని కోరారు.

అభివృద్ధే మా లక్ష్యం

వెంకటగిరి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా తమ కుటుంబం పనిచేస్తోందని తెలిపారు. పోలేరమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించేందుకు కృషి చేశామని, 100 ఎకరాల్లో నగర వనం ఏర్పాటు చేశామని వివరించారు. రూ.110 కోట్లతో తాగునీటి ప్రాజెక్టు తీసుకువచ్చామని వెల్లడించారు. కూటమి నేతల అడుగులకు మడుగులొత్తుతూ వైఎస్సార్‌సీపీ శ్రేణులను వేధించే అధికారులను వదిలిపెట్టమని హెచ్చరించారు. అలాగే పారవోలు ఎంపీటీసీ సభ్యులు పుల్లూరు శ్రీదేవిని అవమానించడం హేయమని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జెడ్పీ చైర్మన్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, విప్ పి.లక్ష్మి, కౌన్సిలర్లు కందాటి కల్యాణి, వహీదా, ధనియాల రాధ, ఆరి శంకరయ్య, సుకన్య, యచ్చా విజయలక్ష్మి, శివకుమార్, సుబ్బారావు, తుపాటి సుజాత, ఆటంబాకం శ్రీనివాసులు, మాడా జానకిరామయ్య, పద్మశాలి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, పార్టీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, రూరల్ అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేనే చైర్మన్.. నాదే పెత్తనం!



పూజలో పాల్గొన్న చెంచయ్యనాయుడు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెంచయ్యనాయుడు వ్యవహారశైలి వివాదాస్పదంగా మారింది. ఆలయ పాలకమండలి ప్రకటించకపోయినా.. తానే చైర్మన్‌లా పెత్తనం చెలాయించడం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాల్లో సేవా కమిటీ పేరుతో చెంచయ్యనాయుడు ఇష్టారాజ్యంగా హవా చూపించారు. ఈ క్రమంలోనే ఆలయంలో చేపట్టే ప్రతి ఉత్సవంలో చెంచయ్యనాయుడుని చైర్మన్‌లా పీటల మీద కూర్చుని పూజలు నిర్వహించేందుకు అధికారులు అనుమతిస్తుండడంపై భక్తులు మండిపడుతున్నారు. గతంలో ఆలయ పాలకమండలి చైర్మన్ భర్తీకి జీఓ రావడం ఒక్కరోజు ఆలస్యమైతేనే పచ్చమీడియా గగ్గోలు పెట్టింది. ఇప్పుడు సర్వం తానే అంటూ హల్‌చల్ చేస్తున్న చెంచయ్యనాయుడు తీరుపై ఎందుకు స్పందించడం లేదని పలువురు ప్రశ్నిస్తుండడం గమనార్హం.

రెండు కిలోల బంగారం స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): కేంద్ర దర్యాప్తు సంస్థల అధికారులు నెల్లూరు కాపువీధికి చెందిన ఓ చాట్ బండి దుకాణ నిర్వాహకుడిని ఆదివారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వివరాలిలా ఉన్నాయి. సెంట్రల్ ఎక్సైజ్ లేదా డీఆర్‌ఐ అధికారులో స్పష్టంగా తెలియదు గానీ ఆదివారం గూడూరు సమీపంలో బిల్లుల్లేకుండా అక్రమంగా తరలిస్తున్న సుమారు 2 కేజీల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తులో కాపువీధికి చెందిన ఓ చాట్ బండి దుకాణ నిర్వాహకుడి ప్రమేయం ఉందని గుర్తించిన అధికారులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. సదరు వ్యాపారి పేరుకే చాట్ బండి దుకాణం నిర్వహిస్తూ లోపల బంగారు వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కలుషితం.. భూగర్భ జలం



తిరుపతి శివారులో వ్యర్థాలను బయటకు విడుదల చేస్తున్న పాల డెయిరీ

తిరుపతి శివారులోని ఓ పాల డెయిరీ నుంచి వెలువడుతున్న మురుగు కారణంగా భూగర్భ జలం కలుషితమవుతోంది. తాగు నీరు రంగు మారుతోంది. దుర్వాసనతో జన జీవనం దుర్భరంగా తయారైంది. రోగాలతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో దిక్కు తోచక కొట్టుమిట్టాడుతున్నారు. పరిశ్రమ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. స్పందించకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

- ఇష్టారాజ్యంగా వ్యర్థాలను వదిలేస్తున్న పాల డెయిరీ
- దుర్వాసన వెదజల్లుతున్న పరిసరాలు
- మురుగునీరు భూమిలోకి ఇంకడంతో తలెత్తుతున్న అనర్థాలు
- వ్యాధులు ప్రబలడంతో ఆందోళన చెందుతున్న ప్రజలు



గడ్డి మాటున పారుతున్న మురుగునీరు

సాక్షి టాస్క్‌ఫోర్స్: తిరుపతి శివారులోని గాంధీపురం పంచాయతీలో ఉన్న ఓ పాల ఫ్యాక్టరీ నుంచి బయటకు వస్తున్న వ్యర్థాల కారణంగా భూగర్భజలాలు కలుషితమై మంచినీరు రంగు మారుతోంది. పరిశ్రమ సమీపంలోని నివసించేవారు దుర్వాసన భరించలేక నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. డెయిరీ నుంచి వెలువడుతున్న వ్యర్థాలు ప్రజలకు అనర్థాలు తెచ్చిపెడుతున్నా అధికారుల్లో ఏ మాత్రం చలనం లేదు.



డెయిరీ ప్రహరీ గోడ వెలుపల చేరిన మురుగు

నిబంధనలకు పాతర

డెయిరీ నిర్వాహకులు పాల వ్యాపారంలో రూ.కోట్లు ఆర్జిస్తున్నా.. సామాన్యుల జీవితాలతో చెలగాలమాడుతుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనల ప్రకారం డెయిరీ నుంచి వ్యర్థాలను శుద్ధి చేసి వదలాల్సి ఉంది. అయితే నిబంధనలకు పాతర వేస్తూ యథేచ్ఛగా మురుగును జనం మీదకు వదిలేయడంపై పలువురు మండిపడుతున్నారు. రూ.కోట్లు సంపాదిస్తున్నా.. వ్యర్థాలను శుద్ధి చేసే యంత్రాలను ఎందుకు ఏర్పాటు చేసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. ప్రజారోగ్యంతో ఆడుకుంటున్న డెయిరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రధానంగా డెయిరీ నుంచి వస్తున్న మురుగునీరు అవిలాల చెరువులో కలుస్తోంది. దీంతో చెరువు వద్ద



పిచ్చిమొక్కల మధ్యలో ప్రవహిస్తున్న వ్యర్థ జలం

స్థానికుల ఆవేదన

పాల డెయిరీ వ్యర్థాలతో నిండిన మురుగునీరు భూమిలోకి ఇంకుతోంది. దీంతో పరిసర ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించుకున్నవారి బోరుల్లో నుంచి ఎర్రగా నీరు వస్తోంది. వాటర్ ప్యూరిఫైయర్ ద్వారా నీటిని శుద్ధి చేసేందుకు కూడా వీలు కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంట్లో మన శ్శాంతిగా ఉండలేకపోతున్నామని, అలాగే సొంతింటిని వదిలి వేరే చోటుకి వెళ్లలేకపోతున్నామని వాపోతున్నారు. డెయిరీ యాజమాన్యానికి తమ సమస్యలు విన్నవించే అవకాశం లేకుండా పోయిందని, అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.

వాకింగ్ కోసం వచ్చేవారు ముక్కు మూసుకుని నడవాల్సి వస్తోంది.

ఫిర్యాదు చేసినా ఫలితం లేదు

డెయిరీ నుంచి వస్తున్న వ్యర్థాలతో ఇబ్బందిపడుతున్నామని జిల్లా ఉన్నతాధికారులు, కాలుష్య నియంత్రణ మండలి వారికి వరుసగా ఫిర్యాదులు చేసినా ఫలితం లేదని గాంధీపురం , అవిలాల పంచాయతీలకు చెందిన పలు కాలనీల వాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంలో రోడ్డు మీదకు వచ్చి ఆందోళనకు దిగడంతో డెయిరీ యజమానులకు అధికారులు నోటీసులు జారీ చేశారన్నారు. అప్పట్లో డెయిరీ స్థలం చుట్టూ ప్రహరీ గోడ నిర్మించారని, కొంతకాలం పాటు బయటకు వదల్లేదని వెల్లడిస్తున్నారు. గత ఆరు నెలలుగా మళ్లీ వ్యర్థాలను ఇష్టారాజ్యంగా బయటకు వదిలేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రధానంగా డెయిరీకి పక్కనే ఉండే జర్నలిస్ట్ కాలనీలో పరిస్థితి మరింత దారుణంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లలో ఉండలేక తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారని వివరిస్తున్నారు. ఈ మేరకు కలెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు వెంటనే స్పందించి డెయిరీ నుంచి వ్యర్థాలు రాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. లేకుంటే కోర్టును ఆశ్రయించడమే తమకు శరణ్యమని స్పష్టం చేస్తున్నారు.

గుంతల్లోకి చేరుతున్న మురుగు

డెయిరీ చుట్టూ ప్రహరీ గోడ ఉన్నప్పటికీ వ్యర్థాలతో కూడిన మురుగునీరు బయటకు వచ్చి గుంతల్లోకి చేరుతోంది. అందులో గేదెలు, పందులు దొర్లుతున్నాయి. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. విషజ్వరాలతోపాటు చర్మవ్యాధులకు గురై ఆస్పత్రుల పాలవుతున్నారు. ఈ క్రమంలో ఇప్పటికే అవిలాల, గాంధీపురం, మల్లంగుంట పంచాయతీల పరిధిలోని కొన్ని బోర్లు నుంచి వస్తున్న నీరు రంగు మారిపోయింది. దీంతో స్థానికులు మంచి నీటికోసం మినరల్ వాటర్ ప్లాంట్లను ఆశ్రయించాల్సి వచ్చింది. డెయిరీ వ్యర్థాలతో కూడిన నీటిని తాగిన పశువులు సైతం అనారోగ్యానికి గురవుతున్న తెలిసింది.



డెయిరీ ప్రహరీ గోడ నుంచి లీకవుతున్న మురుగు నీరు

శాస్త్రోక్తంగా పెద్దకొట్టాయి ఉత్సవం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం శాస్త్రోక్తంగా పెద్దకొట్టాయి ఉత్సవం జరిగింది. ఆలయంలోని అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. స్వామి,అమ్మవార్లకు నైవేద్యం, మంత్రపుష్పం, దీపారాధన, హారతులు సమర్పించారు. ఈవో బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పందుల దాడిలో పంటలు ధ్వంసం

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కాంపాకెం, కరకంబట్టు, కుక్కంబాకం, బుచ్చినాయుడు కండ్రిగ, గ్రామాల్లో పంటలను అడవి పందులు శనివారం రాత్రి ధ్వంసం చేశాయి. చేతికొచ్చే దశంలో పంట నష్టపోవడంతపై బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ అడవి పందులు దాడికి దిగుతుండడంపై ఆందోళన చెందుతున్నారు. అటవీ సరిహద్దు గ్రామాల్లో సుమారు 565 ఎకరాలు సాగులో ఉన్నాయి. వీటిని అడవి పందులు ఇష్టారాజ్యంగా తవ్వేస్తుండడంపై రైతులు దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అడవి పందులను కట్టడి చేయకుంటే తమకు ఆత్మహత్యే శరణ్యమని వాపోతున్నారు. పంటల రక్షణకు సోలార్‌ఫెన్సింగ్‌ను రాయితీపై అందించాలని విన్నవిస్తున్నారు.

ఫిజియోథెరపీపై శిక్షణ



ఆటిజంపై ఫిజియోథెరపీ శిక్షణ సదస్సులో పాల్గొన్న తల్లిదండ్రులు, విద్యార్థులు

తిరుపతి కల్చరల్: నగరంలోని ఎయిర్ బైపాస్ రోడ్డులో ఉన్న రాస్ కార్యాలయంలో ఫిజియోథెరపీ విభాగానికి చెందిన డాక్టర్ రేవతి, డాక్టర్ చరణ్ ఆధ్వర్యంలో ఆదివారం ఫిజియోథెరపిస్టులకు, విద్యార్థులకు ఆటిజంపై అమెరికన్ అడ్వాన్స్‌డ్ ఫిజియోథెరపీ మెళకువలపై శిక్షణలో భాగంగా తెలిపారు. ఇందులో ఆటిజంపై ఉన్న పిల్లల తల్లిదండ్రులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఆటిజంతో ఉన్న పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లల చికిత్స కోసం ఫిజి యోథెరపీ సెంటర్‌ను, లేదా 9290234075ను సంప్రదించాలని వారు తెలియజేశారు.

అరాచకమే అ'జెండా'



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు



ధ్వంసమైన జెండా దిమ్మె

పాకాల : అరాచకమే అజెండాగా కూటమి నేతలు రెచ్చిపోతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు మండిపడ్డారు. ఆదివారం పాకాలలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ప్రధానంగా టీడీపీ నేతలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, గత ప్రభుత్వంలో చేపట్టిన పనులకు పచ్చరంగు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే శనివారం స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మెను ధ్వంసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారం ఉంది కదా అని చెలరేగిపోతే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. పచ్చమూక ఎన్ని జెండా దిమ్మెలను ధ్వంసం చేసినా మళ్లీ నిర్మిస్తామని స్పష్టం చేశారు. ప్రశాంతమైన పల్లెసీమల్లో చిచ్చుపెట్టడం సరికాదన్నారు. ప్రతిపక్ష పార్టీ నేతలను సైతం గౌరవించాలని సూచించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు నంగా కపిలేశ్వర్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ మునీర్, నేతలు మధు, సుధాకర్, మురళి, ఖాదర్, బేటా, ఖాదర్‌వలీ, సెంథిల్, కున్నీ పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగలు, కారు స్వాధీనం

– ఒక స్మగ్లర్ అరెస్ట్



ఎర్రచందనం, కారుతోపాటు నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

తిరుపతి మంగళం : అన్నమయ్య జిల్లా మండలం రాయచోటి – గడికోట మార్గంలో నాలుగు ఎర్రచందనం దుంగలు, కారును స్వాధీనం చేసుకుని ఒక స్మగ్లర్‌ను టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్స్ చీఫ్ ఎల్.సుబ్బరాయుడి ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్సు ఎస్పీ పి.శ్రీనివాస్, డీఎస్పీ బాలిరెడ్డి ఆధ్వర్యంలో ఆర్‌ఐ సాయిగిరిధర్ బృందంలోని ఆర్‌ఎస్‌ఐ సి.వినోద్ కుమార్, సిబ్బంది ఆదివారం రాయచోటి – గడికోట మార్గంలో వాహనాల తనిఖీ చేపట్టారు. వేగంగా వస్తున్న కారును ఆపేందుకు ప్రయత్నించారు. కారు ఆగకుండా వెళ్లడంతో పోలీసులు వెంబడించి వాహనాన్ని పట్టుకున్నారు. కారులో ఉన్న వ్యక్తి దిగి పారిపోతుండగా అదుపులోకి తీసుకున్నారు. కారులో పరిశీలించగా నాలుగు ఎర్రచందనం దుంగలు ఉన్నాయి. వాటిని తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసు స్టేషనుకు తరలించారు. సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీధి కుక్కలకు విషం

- గొర్రెల మందపై దాడి చేస్తుండడంతో విషాహారం పెట్టిన రైతు
- ఐదు కుక్కలు మృతి



వీధి కుక్క కళేబరం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): జీవనాధారమైన గొర్రెలను వీధి కుక్కలు కరిచి గాయపరుస్తూ మృత్యువాత పడేలా చేస్తున్న వీధి కుక్కలకు గొర్రెల యజమాని విషం కలిపిన అన్నం పెట్టడంతో ఐదు కుక్కల మృత్యువాత పడ్డాయి. స్థానికుల సమాచారం మేరకు.. రేణిగుంట మండలం వెంకటాపురం పంచాయతీ అన్నస్వామి పల్లిలో ఓ రైతు గొర్రెలను మేపుకుని వాటిని విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అయితే గొర్రెల మందపై వీధి కుక్కలు తరచూ దాడులు చేసేవి. దీంతో గొర్రెలు మృత్యువాత పడి నష్టం వాటిల్లుతుండడంతో రైతు కుక్కల బెడద వదిలించుకోవాలని భావించాడు. ఆదివారం విషపూరితమైన గుళికల మందును అన్నంలో కలిపి కుక్కలకు పెట్టాడు. ఆ అన్నం తిన్న ఐదు కుక్కలు మృతిచెందాయి. మరికొన్ని చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాయి. అయితే కుక్కలకు విషాహారం పెట్టడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేయాలే తప్ప చంపడం దారుణమని ఆవేదన చెందారు.

కమనీయం.. కల్యాణం

- తుమ్మలగుంటలో వైభవంగా శ్రీరామ నవమి వేడుకలు
- పట్టువస్త్రాలు సమర్పించిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి దంపతులు



పట్టువస్త్రాలు తీసుకువస్తున్న చెవిరెడ్డి దంపతులు, మోహిత్‌రెడ్డి



సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి రూరల్ : మండలంలోని తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామలక్ష్మణులు, ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక అభిషేకం చేపట్టారు. విశేషంగా తీర్చిదిద్దిన మండపంలో సీతారాములను కొలువుదీర్చారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ కనులపండువగా వివాహ మహోత్సవం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి పాల్గొన్నారు.

తలంబ్రాలు పంపిణీ

సీతారాముల కల్యాణోత్సవం తిలకించిన భక్తులకు తలంబ్రాలు పంచిపెట్టారు. వడపప్పు, పానకాలను పంపిణీ చేశారు. అనంతరం వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం జరిపించారు. జై శ్రీరామ్ అంటూ భక్తులు జయజయధ్వానాలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు



ప్రమాదానికి గురైన కారు

శ్రీకాళహస్తి: రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం శ్రీకాళహస్తి పట్టణ శివారు వీఎంపల్లి పీఎన్ జాతీయ రహదారి వద్ద చోటుచేసుకుంది. రెండో పట్టణ పోలీసుల కథనం.. అమ్మపాళెంకు చెందిన మధుసూన్‌రెడ్డి కారులో నెల్లూరుకు బయలుదేరాడు. అదే సమయంలో ప్రకాశం జిల్లాకుకు చెందిన ప్రభుదాస్ తన కుటుంబంతో కలిసి కారులో తిరుమలకు వస్తున్నాడు. మార్గమధ్యంలో వీఎంపల్లి వద్ద మధుసూదన్‌రెడ్డి ప్రయాణిస్తున్న కారు పంక్చర్ కావడంతో అదుపు తప్పి డివైడర్ అవతలి వైపు వస్తున్న ప్రభుదాస్ కారును ఢీకొంది. ఈ ఘటనలో మధుసూదన్‌రెడ్డి తీవ్రంగా గాయపడగా.. ప్రభుదాస్, అతని భార్య హర్షిత, కుమారుడు సామి, అల్లుడు గిరీష్‌కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మధుసూదన్‌రెడ్డిని ప్రథమ చికిత్స అనంతరం కుటుంబ సభ్యులు తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.





ధ్వంసమైన కారు, వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ముగిసిన దివ్యాంగ క్రికెట్ సెలెక్షన్స్



ఎంపికైన క్రీడాకారులతో కమిటీ సభ్యులు

తిరుపతి సిటీ: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ డిఫెరెంట్లీ ఏబుల్డ్ క్రికెట్ కమిటీ, డిఫెరెంట్లీ ఎబుల్డ్ క్రికెట్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్ వేదికగా జరిగిన దివ్యాంగ క్రికెట్ సెలెక్షన్స్ ముగిసినట్టు ఆ సంఘ చైర్మన్ సూర్యనారాయణ, కార్యదర్శి నాగరాజు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా సుమారు 20 మంది దివ్యాంగులు ఈ సెలెక్షన్స్‌లో పాల్గొన్నారని తెలిపారు. ఎంపికలో ఆంధ్ర దివ్యాంగుల క్రికెట్ సంఘ జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ దాసం వెంకట దుర్గారావు, ఉమ్మడి చిత్తూరు జిల్లా దివ్యాంగుల క్రికెట్ సంఘ జాయింట్ సెక్రటరీ తలారి మోహనబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ పురుషోత్తం రెడ్డి, సభ్యులు నరేష్, తులసి కృష్ణా, కోచ్ మహాలింగం శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో 'గ్రీవెన్స్'



కలెక్టరేట్‌కు వచ్చిన అర్జీదారులు(ఫైల్)

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నారు. గత సోమవారం రంజాన్ సందర్భంగా గ్రీవెన్స్ రద్దు చేశారు. ఈ నేపథ్యంలో నేటి గ్రీవెన్స్‌కు పెద్దసంఖ్యలో అర్జీదారులు తరలివచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.

వసతులు అవసరం

వివిధ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు వచ్చిన అర్జీదారులకు కనీస వసతులు కల్పించాల్సిన అవసరముంది. ఈ క్రమంలో మరుగుదొడ్ల శుభ్రం చేయించాలని పలువురు సూచిస్తున్నారు.అలాగే కుర్చీలు, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. అర్జీదారులతో అధికారులు దురుసుగా ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా వృద్ధులు, దివ్యాంగులు ఏదైనా సమాచారం కోసం అడిగితే సిబ్బంది విసుక్కుంటున్నట్లు తెలుస్తోంది. అర్జీలు రాసుకోలేని వారి కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సి ఉంది. అలాగే సమాచారం చెప్పేందుకు కొందరిని అందుబాటులో ఉంచాల్సిన అవసరముంది. జిల్లాస్థాయి గ్రీవెన్స్‌లో నిబంధనల ప్రకారం ఉన్నతాధికారులు పాల్గొనాలి. అయితే పలువురు అధికారులు తమ సబార్డినేట్లను పంపి చేతులు దులిపేసుకుంటున్నట్లు అర్జీదారులు ఆరోపిస్తున్నారు. గ్రీవెన్స్‌లో కలెక్టరేట్ ఉంటే ఒకలా...జాయింట్ కలెక్టర్ ఉంటే ఇంకోలా, డీఆర్‌ఓ ఉంటే మరోలా అధికారులు వ్యవహరిస్తున్నారు. ఇక స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల నేతృత్వంలో గ్రీవెన్స్ నిర్వహిస్తే 25 శాతానికి మించి అధికారులు హాజరుకావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.